క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని రమణయ్యపేటలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరకులను కోరమాండల్ మహిళా క్లబ్ ప్రతినిధులు శనివారం పంపిణీ చేశారు. అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వెంకట దుర్గావతి మాట్లాడుతూ ప్రతి ఇంటా సంక్రాంతి సందడి వెల్లివిరియాలని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, మల్లీశ్వరి, లక్ష్మీ సృజన, మోహిని కుమారి, మాధవీలత, డాక్టర్ శిరీష, ప్రసాద్ నాయుడు, బాపిరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల అందజేత



నడకుదురులో పేదలకు దుప్పట్లు, పండ్లు అందజేస్తున్న అలయన్స్ ప్రతినిధులు

కరప: నడకుదురులోని సిద్ధార్థనగర్‌లో శనివారం అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలయన్స్ క్లబ్ ఆఫ్ పద్మారామ్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 13 మంది పేదలకు దుప్పట్లు, పండ్లు ఆయన అందజేశారు. క్లబ్ ప్రతినిధులు పెంకే శివకుమార్, అల్లైవనుం శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, రీజియన్ చైర్మన్ సుభద్ర, ఆశా వర్కర్ అమూల్య, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి



బ్రాహ్మణులకు నిత్యావసర సరకులు అందిస్తున్న భరద్వాజ సేవా సంఘం సభ్యులు

బోట్‌క్లబ్: ఆపదలో ఉన్నవారిని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని భరద్వాజ సేవా సంఘం అధ్యక్షుడు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సిలర్ ఐవీ రావు అన్నారు. స్థానిక చల్లా ఫంక్షన్ హాల్‌లో శనివారం దాతల సహకారంతో సంక్రాంతి సందర్భంగా నగరంలో 100 మంది బ్రాహ్మణులకు రూ.1.50 లక్షల విలువ చేసే బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకోవడానికి భరద్వాజ సేవా సంఘం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సేవా సంఘ ఉపాధ్యక్షుడు అయ్యగారి వెంకటేష్, కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు, కోశాధికారి ఆర్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి వద్దిపర్తి మురళీరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కరప హైస్కూల్‌లో నాకౌట్ క్రికెట్ పోటీ

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం కరప క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్-2025 నాకౌట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో తొలిరోజు ఐదు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో జైభీమ్ జట్టుపై భావారం సూపర్ కింగ్స్ జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో వేళంగి ఎస్ఎస్-11 జట్టుపై వాకాడ జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో పీపీపీ-11పై కేఆర్పీ-11 జట్టు 8 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. నాలుగో మ్యాచ్‌లో బీవీఆర్-11పై మారిజట్టు 15 పరుగుల తేడాతో గెలుపొందింది. ఐదో మ్యాచ్‌లో వాకాడ-2 జట్టుపై కరప కొత్తపేట జట్టు 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. మంగళవారం నుంచి మెయిన్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు నక్కా భీమ్, నక్కా సాంబయ్య తెలిపారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

పెద్దాపురం: కింది స్థాయి సిబ్బందికి ఎప్పుడూ అండగా ఉంటూ సహాయ, సహకారాలు అందిస్తానని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. డివిజన్‌లోని క్లాస్ ఫోర్ ఉద్యోగులందరికీ శనివారం ఏకరూప దుస్తులను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ డీటీ భానుకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఉద్యోగులు సేవాగుణంతో మెలిగి సహాయ, సహకారాలు అందించుకోవాలని ఆర్డీఓ సూచించారు. క్లాస్ ఫోర్ ఉద్యోగుల సేవలను గుర్తించి దుస్తులను అందజేసిన ఆర్డీఓకు యూనియన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని సుమారు 70 మంది క్లాస్ ఫోర్ ఉద్యోగులకు ఆమె చేతుల మీదుగా ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యాలయ ఏఓ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతతి సంగతి తేల్చేందుకు..

- కుక్కల సమస్య నియంత్రణకు చర్యలు
- ఏబీసీ ఆపరేషన్ల కోసం ఏర్పాట్లు

కాకినాడ: ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్న శునకాలను నియంత్రించేందుకు కాకినాడ నగరపాలక సంస్థ దృష్టి సారించింది. గడచిన కొద్ది రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తోన్న కుక్కలను అదుపు చేసే క్రమంలో శునకాల సంతాన నిరోధక కేంద్రాన్ని మరింత పటిష్టవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశాల మేరకు దీనికోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. జిల్లా కేంద్రం కాకినాడలో దాదాపు 18 వేల వరకూ శునకాలు ఉంటాయని ఓ అంచనా. వీటిలో గడచిన ఐదేళ్లలో 11,800 శునకాలకు యానిమల్ బర్త్ కంట్రోలు (ఏబీసీ) ఆపరేషన్లు చేశారు. ఇంకా దాదాపు 8 వేల శునకాలకు ఆపరేషన్లు చేయాల్సి ఉంది. అయితే కాకినాడ జగన్నాథపురం గోళీలపేటను ఏబీసీ కేంద్రంలో పూర్తి స్థాయి సదుపాయాలు లేకపోవడంతో ఆపరేషన్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రస్తుతం రోజుకు ఆరు నుంచి 10 శునకాలకు మాత్రమే ఏబీసీ ఆపరేషన్లు చేస్తున్నారు. ఈ ఆపరేషన్లను రోజుకు 25 నుంచి 30 చొప్పున చేయడం ద్వారా శునకాల వ్యాప్తిని నియంత్రించాలని నగరపాలక సంస్థ యోచిస్తోంది. దీనికోసం ఏబీసీ కేంద్రంలోని కెన్నల్స్‌కు మరమ్మతులు చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టింది. వీటితోపాటు సదరు



ఏబీసీ కేంద్రంలో కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్న సిబ్బంది

ఏబీసీ కేంద్రంలో ఇతర సదుపాయాల కోసం సుమారు రూ.8 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేస్తుంది. సంక్రాంతి అనంతరం ఈ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడం ద్వారా శునకాలను నియంత్రించవచ్చనే యోచనలో నగరపాలక సంస్థ ఉంది.

ప్రైవేట్ సంస్థకు బాధ్యతలు

ఏబీసీ ఆపరేషన్ల ప్రక్రియను సొసైటీ ఫర్ నేచుర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ సంస్థ చేపట్టనుంది. ఆ మేరకు నగరపాలక సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఒక్కో శునకానికి ఆపరేషన్ చేసేందుకు రూ.1,300లు చొప్పున నగరపాలక సంస్థ చెల్లించనుంది. ఆయా ప్రాంతాల్లోని శునకాలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించే బాధ్యతను



మాత్రం నగరపాలక సంస్థ చేపడుతోంది. ఆపరేషన్ల అనంతరం మూడు రోజులపాటు సదరు శునకాలను స్నాప్ సంస్థ పర్యవేక్షణలో ఉంచి ఆ తరువాత వాటిని వదిలి పెడతారు. ఆపరేషన్ల ప్రక్రియకు సంబంధించి ప్రాజెక్టు రికగ్నిజేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశామని స్నాప్ ప్రతినిధి శ్యామ్ చెప్పారు. ఆ మేరకు అధికారులు దీనిని పర్యవేక్షిస్తున్నారు.

త్వరలో వేగవంతం చేస్తాం



శునకాలను నియంత్రించేందుకు ఏబీసీ ఆపరేషన్లను మరింత వేగవంతం చేస్తున్నాం. ప్రస్తుతం రోజుకు ఆరు నుంచి 10 ఆపరేషన్లు జరుగుతున్నాయి. సంక్రాంతి అనంతరం రోజుకి 25 నుంచి 30 ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు సంబంధించి నగరపాలక సంస్థ చేసే ఏర్పాట్లతోపాటు ప్రైవేట్ సంస్థకు కూడా అవసరమైన సూచనలు ఇచ్చాం.

–డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్‌ఓ, కాకినాడ

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించాలి



ధూమపానంతో అనర్థాలను వివరిస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ధూమపాన ప్రభావిత దినోత్సవం సందర్భంగా రమణయ్యపేటలోని కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ధూమపానంతో క్యాన్సర్, గుండె జబ్బులు, ఆరోగ్య సమస్యలు వస్తాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. సిగరెట్ తాగడం వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచంలో 8 మిలియన్లకు పైగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఇందులో ధూమపానం పొగ పీల్చేవారు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. సదస్సులో డాక్టర్లు సువర్ణరాజు, సిరాజ్, అడబాల రత్న ప్రసాద్ తదితరులు ఉన్నారు.

భజన గురువు గోవిందరాజులుకు సత్కారం



భజన గురువును సత్కరిస్తున్న మాజీ సర్పంచ్, కమిటీ సభ్యులు

కరప: స్థానిక మెరకవీధి రామాలయం వద్ద శనివారం సప్తాహ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భజన గురువు పెద్దిరెడ్డి గోవిందరాజులు దంపతులను సప్తాహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మెరకవీధి రామాలయం వద్ద ఏడేళ్లుగా వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భజన గురువు గోవిందరాజులు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల భజన పాలీలతో సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సప్త సప్తాహం ముగింపు సందర్భంగా గ్రామ పురోహితులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం, మణికంఠల ఆధ్వర్యంలో శాంతి హోమం నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం భజన గురువు దంపతులను ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, దేవు జమీందార్, దేవు వీరబాబు, నక్కా సత్తిబాబు, నక్కా శ్రీనివాస్, నక్కా సాంబయ్య, సీహెచ్ కాపు, పీఏసీఎస్ విశ్రాంత సీఈఓ చోడపునీడి వెంకటరమణ, పి.తాతారావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ అలంకరణలో సీతారామస్వామి



భోగి గణపతి పీఠంలో గోపూజ చేస్తున్న భక్తులు



దత్తాత్రేయ అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: ధనుర్మాస మహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి దత్తాత్రేయ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

వైభవంగా గోపూజ

స్థానిక భోగి గణపతి పీఠంలో గోపూజ నిర్వహించారు. లోక కల్యాణ కారకమైన గోసంపద సర్వం శ్రీకరమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. గోవును ఆరాధించిన వారికి, తల్లిదండ్రులను సేవించిన వారికి ఉత్తమ సద్గతులు కలుగుతాయన్నారు. అనంతరం ఆలయంలో 67వ జపయజ్ఞ పారాయణ చేశారు.

కోడి పందేల బరులు ధ్వంసం



గురజనాపల్లిలో కోడి పందేల బరిని ట్రాక్టర్‌తో ధ్వంసం చేయిస్తున్న అధికారులు



తిమ్మాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవీంద్రబాబు, రెవెన్యూ అధికారులు

కరప: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలో ఎవరైనా కోడి పందేలు నిర్వహించినా, రికార్డింగ్ డ్యాన్స్‌లు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, కరప ఎస్ఐ టి.సునీత హెచ్చరించారు. మండలంలోని గురజనాపల్లి, గొర్రిపూడి, వేములవాడ, కొరిపల్లి తదితర గ్రామాల్లో శనివారం రెవెన్యూ, పోలీసు సిబ్బంది జాయింట్ యాక్షన్ బృందంతో కలసి వారు పర్యటించి, కోడి పందేలు నిర్వహించే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టించారు. కోడి పందేలు జరిగే అవకాశమున్న ప్రదేశాల యజమానులను కలసి నోటీసులు జారీచేశారు. పందేల నిర్వహణకు తయారు చేసిన బరులను ట్రాక్టర్‌తో దున్నించి, ధ్వంసం చేశారు. అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఏఎస్ఐ వి.సూరిబాబు, మండల వెటర్నరీ డాక్టర్ ఎం.రవికిరణ్, వీఆర్వోలు పీవీ శ్రీనివాసరావు, ఎస్.వెంకటేశ్వర్లు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలే ముద్దు

కాకినాడ రూరల్: కోడి పందేలు వద్దు – సంప్రదాయ క్రీడలే ముద్దు అని తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తిమ్మాపురంలో పోలీసులు, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు కోడి పందేలు నిర్వహిస్తారని అనుమానం కలిగే ప్రాంతాల్లో పర్యటించి హెచ్చరికలు జారీ చేశారు. ఎస్సై రవీంద్రబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వాతావరణ శాఖ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ప్రదర్శన

బాలాజీచెరువు: ఇండియా మెటీరియలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ) వాతావరణ శాఖ ఏర్పడి ఈ నెల 15వ తేదీ నాటికి 150 పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడ వాతావరణం కేంద్రం మెట్రాలజిస్ట్ ఆఫీసర్ డి.రాంబాబు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక శుభానికేతన్ స్కూల్‌లో విద్యార్థులకు తుపాన్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మాన్సూన్ సీజన్ తదితర అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8, 9 తరగతుల విద్యార్థులు 117 మంది పాల్గొన్నారు. ఐఎండీ ప్రాముఖ్యతను రాంబాబు విద్యార్థులకు వివరించారు. తుపాన్లు, భూకంపాలు, ఉష్ణోగ్రతలను ఎలా గుర్తిస్తారనే దానిపై అవగాహన కల్పించారు. అలాగే విమానాలు, హెలికాప్టర్లు ఆకాశంలో ప్రయాణించే సమయంలో వాటికి వాతావరణ రిపోర్టును ఏ విధంగా తెలియజేస్తారనే అంశాలను తెలిపారు. మిలటరీ, పోలీస్ తదితర శాఖల వల్లే 24 గంటల విధులను ఐఎండీ నిర్వహిస్తుందన్నారు. పాఠశాల తరఫున అకడమిక్ కో–ఆర్డినేటర్ రమాదేవి క్విజ్, వ్యాసరచన పోటీలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల హెడ్, కరస్పాండెంట్ సుభాషిణి, ఐఎండీ ఆఫీసర్ రాంబాబు విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ వాతావరణ శాఖ ఉద్యోగులు మాణిక్యాలరావు, అశోక్, నరసింహమూర్తి, షేక్ రియాజ్, శుభానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ రజనీ తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న నేటితరానికి ఆదర్శం

కాకినాడ సిటీ: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, పేద రైతులు, గ్రామస్తుల హక్కులను కాపాడటంలో వడ్డే ఓబన్న కీలకపాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ షణ్మోహన్, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటం ప్రారంభానికి ముందు 1857లో భారతదేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రతి ఘటనలో వడ్డే ఓబన్న ముఖ్యపాత్ర పోషించాన్నారు. స్వతంత్ర సంగ్రామంలో ఒక అధ్యాయంగా నిలిచి, వడ్డే ఓబన్నలోని ప్రజాస్వామ్య విలువలు, ధైర్య సాహసాలను ప్రజలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఆయన జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం శుభ పరిణామమని కలెక్టర్ తెలిపారు. 1807 జనవరి 11న నంద్యాల జిల్లా, సంజమల మండలం నొస్సం గ్రామంలో జన్మించిన వడ్డే ఓబన్న బ్రిటిష్ వారిపై పోరాటం చేశారన్నారు. ఆయన ధైర్య సాహసాలు నేటితరానికి ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, కాకినాడ డివిజన్ సహాయ బీసీ సంక్షేమాధికారి తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, గోవాల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కరప: పాతర్లగడ్డ సమీపంలో మోటార్ సైకిల్ ఢీకొనగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన కొమ్మోజు వెంకటేశ్వరరావు (60)కు మతిస్థిమితం సరిగా లేదు. గొర్రిపూడి, పాతర్లగడ్డ గ్రామాల్లో భిక్షాటన చేస్తున్నాడు. శనివారం రాత్రి రోడ్డుకు ఎడమ వైపు నుంచి నడచుకుంటూ అతను వెళుతుండగా గొర్రిపూడి వైపు నుంచి కాకినాడ వైపునకు వెళుతున్న మోటార్ సైక్లిస్ట్ వేగంగా నడుపుతూ వెంకటేశ్వరరావును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వరసకు కుమారుడు అయిన శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ టి.సునీత దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు పక్కన వెంకటేశ్వరరావు మృతదేహం

డీలర్ల నియామకానికి రాత పరీక్ష

కాకినాడ సిటీ: కాకినాడ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 96 చౌకధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించడానికి ఈ నెల 19న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు శనివారం తెలిపారు. ఈ నెల 1న జిల్లాలోని 96 రేషన్ షాపులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించగా 800 పైచిలుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అభ్యర్థులందరికీ ఈనెల 12న తహసీల్దార్లు హాల్ టిక్కెట్లు జారీ చేస్తారన్నారు. హాల్ టిక్కెట్‌పై ఫొటో అతికించని వారు పాస్‌పోర్టు సైజ్ ఫోటో అతికించి పరీక్షకు హాజరు కావాలన్నారు. ఈ రాత పరీక్ష పీఆర్ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో 19వ తేదీ ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. రాత పరీక్ష మొత్తం 80 ప్రశ్నలకు ఒక్కొక్క ప్రశ్నకు ఒక మార్కుకు ఉంటుందన్నారు. అభ్యర్థులను ఉదయం 10 గంటలకు పరీక్ష హాలులోకి అనుమతిస్తారన్నారు. అభ్యర్థుల వెంట హాలు టిక్కెట్, బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకు రావాలన్నారు. సమాధానంలో దిద్దిబాటు ఉండకూడదని, దిద్దుబాటు ఉన్న సమాధానాలను పరిగణనలోకి తీసుకోరన్నారు. రాత పరీక్షలో కనీసం 30 మార్కులు సాధించిన వారు మాత్రమే మౌఖిక పరీక్షకు అర్హులని ఆర్డీఓ వివరించారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో దూకిన వ్యక్తి కోసం శనివారం కూడా పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు సాగించారు. పెదపూడిలో లోకల్ పేపర్ విలేకరిగా పని చేస్తున్న షేక్ సలీమ్ (36) గురువారం రాత్రి స్థానిక రైల్వే గేట్ ఎదురుగా ఉన్న గోదావరి కాలువపై ఉన్న నూతన వంతెన నుంచి గోదావరి కాలువలో దూకిన విషయం విధితమే. గురువారం రాత్రి నుంచి బంధువులతో పాటు పోలీసులు గోదావరి కాలువలో గాలిస్తున్నారు. అయితే శనివారం రాత్రి వరకూ సలీమ్ ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. కాలువలో గుర్రపు డెక్క కారణంగా గాలింపునకు అంతరాయం కలుగుతుందని సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు.

ఆరోపణ చేస్తున్న వారిని శిక్షించండి

కొత్తపల్లి: తాను గ్రూపు సభ్యుల సొమ్మును తినేశానంటూ తప్పుడు ఆరోపణ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని వీఓఏ ఓసిపల్లి కృప ఆవేదన వ్యక్తం చేసింది. ఉప్పాడ బర్మాకాలనీలో ఉన్న తన స్వగృహం వద్ద గ్రూపు సభ్యులతో కలసి శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. ఆరోపణలు చేస్తున్న ఒక విలేకరి, తిరంశెట్టి చిన్నిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సమైక్యలో ఉప్పాడలోని ఒక వీఓఏగా ఆమె పదేళ్లుగా పని చేస్తుంది. ఇటీవల కొన్ని కారణాలతో గతంలో పని చేసిన ఏపీఎం పక్కన పెట్టిందన్నారు. ఆ మధ్యకాలంలో తిరంశెట్టి చిన్నికి తన బాధ్యతను అప్పగించారన్నారు. అయితే గత సంవత్సరం డిసెంబర్ నెలలో తనకు తిరిగి వీఓఏగా బాధ్యతలు అప్పగిస్తూ 30 గ్రూపుల సభ్యుల అంగీకారంతో ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ లెటర్ ఇచ్చారన్నారు. విధులు నిర్వహిస్తున్న తనను గ్రూపు సభ్యుల నుంచి రూ.27 లక్షలు తినేశానని చిన్ని, ఒక విలేకరి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ విలేకరి తనను మానసికంగా వేధిస్తున్నాడంటూ వాపోయింది. ఆ ఇద్దరిపై పరువు నష్టం దావా వేస్తానని, కొత్తపల్లి పోలీసులకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తానని కృప తెలిపింది.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి



సూరంపాలెం ప్రగతి కళాశాలలో విద్యార్థులతో కలిసి భోగి మంటలు వెలిగిస్తున్న చైర్మన్ కృష్ణారావు



సర్పవరం భావన ఎస్టేట్‌లో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

గండేపల్లి: విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ అలవరుచుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రైడ్స్ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు శనివారం సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన త్రోబాల్, వాలీబాల్, క్రికెట్, జావెలిన్, రన్నింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు సందడి చేశారు. గాలి పటాలు ఎగురవేశారు. భోగి మంటలు, హరిదాసు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ప్రిన్సిపాల్ జి.నరేష్, ఎం.సతీష్, డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం భావనగర్‌లో బాలదుర్గ షణ్ముఖ భావన్నారాయణ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు సంక్రాంతి శోభ ఉట్టిపడేలా పలు రకాల ముగ్గులతో అలరించారు. ప్రథమ బహుమతిగా రూ. 5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ. 2 వేలు అందించారు. బాల దుర్గ షణ్ముఖ భావనారాయణ బ్రాహ్మణ సంఘం ప్రెసిడెంట్ దినవహి పేరాజు (పేరు బాబు), భావన్నారాయణ ఎస్టేట్స్ నిర్వాహకుడు యార్లగడ్డ గోపాలకృష్ణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సెక్రటరీ ఆకలి సత్యనారాయణ, రామారావు, మంజులూరు అనంతలక్ష్మి, తాడేపల్లి ప్రసాద్, వద్దిపర్తి నరసింహారావు, దినవహి వెంకట్‌రాజు, ఎల్లా జోషుల రామకుమార్, బుర్ర కృష్ణ, దీపిక, సావిత్రి పాల్గొన్నారు.